

స్టడీ టూర్లతో విద్యార్థులకు అవగాహన



పరిశ్రమ వద్ద విద్యార్థినీ విద్యార్థుల బృందం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్టడీ టూర్ల వల్ల విద్యార్థులలో సాంకేతిక అంశాలపై అవగాహన కలుగుతుందని జడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం కెఎస్కె.మాణిక్యాలరావు తెలిపారు. శుక్రవారం పాఠశాల విద్యార్థుల స్టడీ టూర్ లో భాగంగా పెరవలి రవళి స్పిన్నింగ్ పరిశ్రమను 9వ తరగతి విద్యార్థులు సందర్శించారు. ఒకేషనల్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ స్టడీ టూర్ లో దాదాపు 100 మంది పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

వివాహం.. వ్యయ భరితం..

- గతేడాది కంటే ఖర్చులు రెట్టింపు
- పేద, మధ్యతరగతి ప్రజల బెంబేలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పెళ్లిపై ధరల మోత మోగుతోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వివాహ సామగ్రికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రతి కుటుంబం తమ కుటుంబంలో జరగబోయే వివాహాన్ని మధురజ్ఞాపకంగా భావించటం పరిపాటి. ఉన్నంతలో అంగరంగ వైభవంగా చేయాలని ఆరాట పడతారు. కాగా.. ప్రస్తుతం పెళ్లిళ్లకు ధరల సెగ తగులుతుండడంతో వధూవరుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసరాల వస్తువుల నుంచి, కల్యాణ మండపాలు, బ్యాండు మేళాలు, డెకరేషన్ సామగ్రి.. ఇలా అన్నింటా ధరలు రెట్టింపయ్యాయి. అంచనాలకు మించి ఖర్చులు పెరిగిపోవడంతో నిర్వాహకులు సతమతం అవుతున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన పెళ్లిళ్ల సీజన్ వచ్చేనెల 21 వరకు కొనసాగనుంది. జిల్లాలో ఈ నెలన్నర వ్యవధిలో సుమారు 10 వేల వివాహాలు జరుగనున్నట్టు అంచనా. ఉమ్మడి జిల్లాలో సుమారు 600లకు పైగా కల్యాణ మండపాలు ఉన్నాయి. సామర్థ్యం సౌకర్యాల ఆధారంగా ఒక్కో కల్యాణ మంటపానికి రోజుకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. తమ దగ్గరే భోజనాలు, టిఫిన్, పూల అలంకరణ తదితరాలు తీసుకోవాలని షరతులు సైతం విధిస్తున్నారు. పెళ్లి ఖర్చులో సుమారు 20 శాతం మంటపాల అద్దెలకు చెల్లించక తప్పడం లేదు.

దుస్తులు, ఇతర కానుకలపై ధరాభారం

పెండ్లి కుమార్తె, కుమారుడితో సహా తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు సైతం దుస్తుల నిమిత్తం పెద్ద మొత్తంలో ఖర్చుకు సిద్ధమవుతున్నారు. బంధువులకు కానుకలుగా దుస్తులు అందజేస్తున్నారు. కొంతకాలంగా వస్త్రాలపై జిఎస్టి కూడా విధిస్తుండటంతో ధరలు మరికాస్త పెరిగిపోయాయి. వివాహంలో కేవలం వస్త్రాలకే రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చువుతోంది. వివాహ సమయంలో బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి తీసుకోవడం ఆనవాయితీ. సామాన్య మధ్యతరగతి ఇళ్లలోనే వీటన్నింటి ఖర్చు గతంలో సుమారుగా రూ.మూడు లక్షలు ఉండేది. ఇప్పుడు రూ.ఆరేడు లక్షలు దాటిపోతోంది. బంగారం తులం ధర రూ.60 వేలు దాటిపోవడంతో ఖర్చు రెట్టింపయ్యింది. జిల్లాలో సుమారు 450 బంగారు దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటిలోనూ రూ.కోట్లలో అమ్మకాలు సాగుతున్నాయి. దీంతో ధరలు పెరిగే అవకాశం ఉందనే ప్రచారం ఊపందుకోవడంతో వధూ వరుల తల్లిదండ్రులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

నింగిని తాకుతున్న నిత్యావసరాలు

పప్పు దినుసులు, ఇతర నిత్యావసరాల ధరల పెరుగుదలతో పెళ్లిళ్ల నిర్వాహకులు బెంబేలెత్తి పోతున్నారు. వంటనూనెల ధరలు, ఇతర సరుకుల ధరలు అధికమవడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో రూ.1800 ఉండే వాణిజ్య గ్యాస్ సిలండర్ ధర రూ.2,400 చేరిన విషయం విదితమే. టమాట, కూరగాయలు, కిరాణా సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయి. బంధువులు, స్నేహితులకు రవాణా సదుపాయాల కల్పించేందుకు రూ.వేలల్లో ఖర్చు అవుతోంది. పెట్రోల్ డీజిల్ ధరలు, వాహనాల వార్షిక పన్నులు పెరగడంతో కార్లు, బస్సుల అద్దెలు 25 శాతం వరకూ పరిగాయి. దీంతో ప్రయాణ ఖర్చులకు సుమారు రూ.50 వేలు వరకు ఖర్చవుతోంది. పూల ఖర్చులూ అదే బాటలో ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ప్రస్తుతం మార్కెట్లో కిలో మల్లెలు రూ.500 వరకు పలుకుతున్నాయి. కనకాంబరాలు రూ.600 పైమాటే.. వేదిక పూల అలంకరణ నిమిత్తం రూ.లక్షకు పైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కుటుంబసభ్యుల అవసరాల నిమిత్తం తక్కువలో తక్కువగా రూ.30 వేలు అయినా ఖర్చు చేయాల్సి వస్తోందని తెలుస్తోంది. మొత్తం మీద తాజా పరిస్థితులలో పెళ్లి ఖర్చులు ధరల పెరుగుదల మధ్యతరగతివారికి, పేదలకు ఇబ్బందిగా మారింది. ఆడంబరాల సంగతి ఎలా ఉన్నా సాధారణ ఖర్చులే తడిసిపమోపడవుతున్నాయని వధూ, వరుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్


ఈ నెలలో మొదటి వారంలో మా అబ్బాయికి వివాహం చేశాను. కల్యాణ మండపానికి అద్దె రూ.80 వేలు చెల్లించాను. డెకరేషన్, ఎసి ఖర్చులు ఇక సరేసరి. మొత్తం మీద రూ.2 లక్షలుపై మాటే. గత 20 ఏళ్లుగా వ్యాపార రంగంలో ఉన్నాను. మా ఇంటిలో జరిగిన మొదటి శుభకార్యం కావడంతో బంధువులు, స్నేహితులు అందరినీ ఆహ్వానించాము. భోజనాలు, కానుకలు ఇతరత్రా ఖర్చులు కలిపితే మొత్తం రూ.15 లక్షల వరకూ వెచ్చించాల్సి వచ్చింది.

- కె.రాము, ఆర్యాపురం, రాజమహేంద్రవరం.

రూ.5 లక్షలు వెచ్చించక తప్పలేదు

ఇటీవల కుమార్తె వివాహం జరిపించాను. చిరు వ్యాపారమే మాకు జీవనోపాధి. వరుడు సమీప బంధువే, ఇరు కుటుంబాలు తక్కువ ఖర్చులో పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నాము. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా కొద్దిమంది బంధువులు, స్నేహితులతో నిరాడంబరంగా వివాహం జరిపించాను. దుస్తులు, భోజనాలు, ఇతర ప్రయాణ ఖర్చులు వెరసి సుమారు రూ.5 లక్షల వరకూ ఖర్చు అయింది. ప్రస్తుతం అన్ని ధరలూ పెరగడమే దీనికి కారణం.

- కె.శ్యామ్ సీతంపేట, రాజమహేంద్రవరం.


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

థీమ్ పార్క్‌లుగా అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నగరంలోని పార్కులను మూస పద్ధతిలో కాక ఒక ప్రత్యేకత కలిగిన థీమ్‌లతో కూడి నగరవాసులను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రశాంతి స్పష్టం చేశారు. 2027 పుష్కరాల నాటికి ఆ మేరకు పనులు పూర్తి చెయ్యాలని తెలిపారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సెవెన్ హిల్స్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో నగరంలోని 26 పార్కులు , నగరవనం అభివృద్ధిపై ప్రతిపాదించిన ముసాయిదా పిపిటిని మున్సిపల్ కమిషనర్ కేతన గార్గ్‌తో కలిసి కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, నగరంలోని 26 పార్కులను ఆయా పార్కుల అభివృద్ధి ఒక ప్రత్యేకత కలిగి ఉండేలా చూడాలని సూచించారు. ఇప్పటికే నగరంలో కంబాల చెరువు పార్కు, దానవాయిపేట, ప్రకాశ్ నగర్, జెఎన్ రోడ్డు, ఎవి.అప్పారావు రోడ్డు, వంటి ప్రాంతాల్లో పార్కులు అభివృద్ధి చేశామని, వాటికి మరింత విలువ ఆధారితమైన విధానంలో పార్కుల అభివృద్ధి చెయ్యాల్సి ఉందన్నారు. కేవలం పార్కులు విశ్రాంతికో, పిల్లల ఆటలకో పరిమితం కాకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రాంతాల వారీగా థీమ్ పార్కులు ఆటలకు, జిమ్, యోగా, డ్యాన్స్, మెడికేటెడ్ ప్లాంట్స్, మ్యూజిక్, డ్యాన్స్, రాక్ గార్డెన్, శారీరక వ్యాయామం, స్పోర్ట్స్, వాటర్ షో, అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లవర్, బర్డ్స్, వ్యర్థాల నుంచి విభిన్న ఆకృతుల కలయిక, ఇక్కడి సంస్కృతి సంప్రదాయాల ఆధారంగా వినూత్న డిజైన్లు రూపొందించడం ద్వారా వివిధ రకాల ప్రతిపాదనలతో పార్కుల ఏర్పాటు చేయలన్నారు. పిల్లలకు ఆహ్లాదం కలిగించేలా పార్కులు ఉండేలా చూడాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. పెద్ద వారి నుంచి చిన్నారుల వరకు అన్ని వర్గాల వారికీ ఆసక్తి, పార్కులకి రావాలనే ప్రేరణ కలుగ చేయాలన్నారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి వాటి మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పర్యాటక, హార్టికల్చర్, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కడియం నర్సరీ ప్రాంతాల్లో పర్యాటక ప్రదేశాలు అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే కడియం ప్రాంతాన్ని పర్యాటక పరంగా ఆకట్టుకునే రీతిలో అభివృద్ధి ప్రభుత్వ ప్రవేటు భాగస్వామ్యంతో కడియం నర్సరీలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేలా నర్సరీ ప్రతినిధులతో సంప్రదించి, కార్యరూపం దాల్చినట్టు తెలిపారు. కడియం నర్సరీలను పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే విధంగా వివిధ రకాల అంశలతో కూడిన బోటింగ్, స్టాల్స్, జిప్ లాగ్, అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాల సమ్మేళనంగా రూపొందించిన రూట్ మ్యాపింగ్‌పై సూచనలు చేశారు. ఉపాధి స్టాల్స్, బోటింగ్ ప్రతిపాదన కోసం లే అవుట్‌పై అధికారులు వివరించారు. వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ పాత్‌లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నగరవనం అభివృద్ధిపై వినూత్న ఆలోచనలతో ముందుకు రావాల్సి ఉందని మున్సిపల్ కమిషనర్ కేతన గార్గ్ పేర్కొన్నారు. ఇకో ఫ్రెండ్లీగా అభివృద్ధి చెయ్యడం ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రణాళిక తయారు చేసిన పిపిటిని పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శైలజ వల్లి, ఆర్ఎంసి అధికారి అబుల్ మాలిక్, ఎపిఎంఐపి పీడ ఎ.దుర్గేష్, జిల్లా పర్యటక అధికారి పి.వెంకటాచలం, ఎంపిడిఒ కె.రమేష్, కడియం డిప్యూటీ తహశీల్దారు సునీల్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డిఇఒ వాసుదేవరావు

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పాఠశాల స్థాయిలో విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తు సాధించాలని జిల్లా పాఠశాల విద్యాధికారి కంది వాసుదేవరావు విద్యార్థులకు హితవు పలికారు. స్థానిక దానవాయిపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఐడిబిఐ రాజమహేంద్రవరం బ్రాంచ్ సౌజన్యంతో సమకూర్చిన 17 ఐరన్. బెంచీలను పాఠశాల యాజమాన్యానికి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ యాజమాన్యం చేస్తున్న దాతత్వ కార్యక్రమాలను వాసుదేవరావు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సమయాన్ని సద్వినియోగం చేసుకొని చక్కటి ప్రణాళికతో చదవాలని ఆయన దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ బ్రాంచ మేనేజర్ ప్రణయ్ కుమార్, స్థానిక బ్రాంచ్ సిబ్బంది జయకర్, లంక సోనీ, చాందిని, ఇన్‌ఛార్జి హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎల్.ప్రభాకరరావు, లక్ష్మీనారాయణ, లూక్ రాజు, శేఖర్, ఖమర్ సుల్తానా, లతాశ్రీ, పద్మావతి, టి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సచివాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


సర్వే రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని ఖండవల్లి గ్రామసచివాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతల ప్రకారం సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని, ఆర్ఎస్ఆర్‌కి క్షేత్ర స్థాయిలో కొలతలు సరిపోవాలని, నిర్దేశించుకున్న సమయపాలనలోగా రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించరాఉ. గ్రామంలో రీసర్వే పురోగతిని సమీక్షించారు. రెవెన్యూ సర్వే రికార్డ్ క్షేత్ర స్థాయి భూమిపై డేటాను సర్వే చేసే సమయంలో రెండు రికార్డ్‌ల వివరాలు సరిపోవాలని, సర్వే సమయంలో అటువంటి సమస్యలు గుర్తించారా అని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. జియోలొకేషన్ రికార్డ్, ఇమేజ్ ఫీచర్‌లను ధృవీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందన్నారు. గ్రౌండ్ ట్రూటింగ్ ద్వారా భూముల సరిహద్దులను గుర్తించడం సులభతరం చేస్తుందని, ఎటువంటి వివాదాలు తావులేకుండా పారదర్శకంగా ఉండేలా తోడ్పడుతుందని తెలిపారు. కొలతల ప్రకారం లేని పక్షంలో ఏ విధమైన చర్యలు తీసుకునానరో అనేదానికి సంబంధించి యజమానులకు నోటీసు జారీ చేసి వాస్తవ భూ కొలతల ఆధారంగా సర్వే నెంబర్‌లో ఉన్న భూమి సరిపోవాలని స్పష్టం చేశారు. రీ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను, మార్గదర్శకాల మేరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రీ సర్వేలో అభ్యంతరాలు ఉంటే వాటిని అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని ఆమేరకు పరిష్కారం చేయాలని సూచించారు. ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో సర్వే వివరాలు, సర్వే రికార్డులను అనుసరించి బేరీజు వేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, తహశీల్దారు డి.అచ్యుత కుమారి పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాప్ విజయవంతం



సర్వే రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో భౌతిక శాస్త్ర విభాగానికి సంబంధించి 'రేడియోకెమిస్ట్రీ, ఒడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు" అనే అంశంపై ఐదు రోజుల డిఎ బిఆర్ఎన్ఎస్ ఐఎన్‌కాస్ జాతీయ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూక్లియర్ కెమిస్ట్స్ అండ్ అలైడ్ సైంటిస్ట్స్, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్, ముంబైతో కలిసి ఈ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమానికి సీనియర్ సైంటిస్ట్, రేడియోఫార్మాస్యూటికల్స్ విభాగం అధిపతి డాక్టర్ తపస్ దాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కెబి, భౌతిక శాస్త్ర విభాగం అధిపతి కోమల లక్ష్మి తదితరులు హాజరయ్యా తపస్ దాస్ ప్రసంగించారు. మరో కీలక సెషన్‌ను డాక్టర్ అతాను ఝా నిర్వహించారు, ఐఎన్‌కాస్ కన్వీనర్ డాక్టర్ పి.ఎస్. రామాంజనేయులు, రేడియేషన్ భద్రత మరియు రేడియోలాజికల్ లాబొరేటరీ ఏర్పాటుపై కీలకమైన ఉపన్యాసం ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు, సంస్థల నుండి అధ్యాపకులు, పరిశోధనా పండితులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. జాతీయ వర్క్‌షాప్ అణు శాస్త్రాలలో అవగాహన, జ్ఞాన భాగస్వామ్యం, నైపుణ్య అభివద్ధిని ప్రోత్సహించడానికి, బహుళ డొమైన్‌లలో శాస్త్రీయ పురోగతి, సాంకేతిక పురోగతికి దోహదపడటానికి కీలకమైన వేదికైంది.

120 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వెలగదుర్రులో శుక్రవారం ఎంవిఎస్.రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పటల్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ బషీర్ తెలిపారు. వీరిలో 15 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముదునూరి రవీంద్ర రాజు, పి.శ్రీనివాసరాజు, నారాయణ రాజు, ఇందుకూరి త్రినాథరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం

విద్యుత్ లైన్‌లో చెట్టు కొమ్మలు తొలగింపు నిమిత్తం వేమగిరి విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో వేమగిరి ఇండస్ట్రియల్ ఫీడర్‌కు శనివారం ఉదయం: 08.00 గంటల నుండి 1:00 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. కడియం మండలంలోని వేమగిరి, వేమగిరి గట్టు, వేమగిరితోటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

గుండెపోటుకు అందుబాటులో ఇంజక్షన్

ప్రజాశక్తి-కడియం


కడియం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటుకు గురైన రోగులకు రూ.45 వేల విలువగల టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ ఉచితంగా అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రత్న మాధురి తెలిపారు. సంవత్సర కాలంలో కడియం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుండెపోటుకు గురైన నలుగురు రోగులకు ఈ ఇంజక్షన్ ఉచితంగా అందజేసి రక్షించినట్టు తెలిపారు. గుండెపోటుకు గురైన రోగులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణం దగ్గరలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి ఈ విలువైన సేవలను వినియోగించుకోవా ఆమె సూచించారు.

రీ సర్వే బృందాలు సరిహద్దులను గుర్తించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రీ సర్వే బృందాలు రైతులను సమన్వయపరచి, వారి సహకారంతో సరిహద్దులను గుర్తించాలని సంబంధిత అధికారులు సూచించారు. శుక్రవారం రీ సర్వే పైలెట్ గ్రామం సత్యవాడలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని ఎడి సర్వే డీఐఓ బందం పరిశీలించింది. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎల్ఒ, తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, రీ సర్వే డిటి ఎం.హరిప్రసాద్, గ్రామ సర్వేయర్ ఆర్.మారుతి శ్రీరామ్, విఆర్ఒ జె.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నులి పురుగుల నివారణపై అవగాహన


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-ఉండ్రాజవరం, కడియం

నులిపురుగుల నివారణకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నిర్వహించే నులిపురుగులు నివారణ దినోత్సవం కార్యక్రమంపై శుక్రవారం ఉండ్రాజవరం మండలం మోర్త, చివటం, గ్రామాల్లోని ఎంపిపి స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రోజా పిల్లలకు చేతులు శుభ్రం చేసుకునే దశలను వివరించారు. ఎప్పుడెప్పుడు చేతులను పరిశుభ్రం చేసుకోవాలో వివరించారు. ఎఎన్ఎం సరోజ ఆల్బండోజోల్ మాత్రలు అందరూ వేసుకోవాలని, నులిపురుగులు ఏ విధంగా అనారోగ్యానికి కారణం అవుతాయో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి కె.విజయ కుమారి, ఎఎన్ఎం డి.సూర్యకుమారి, ఉపాధ్యాయులు, ఆశాలు సుజాత, విజయ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10వ తేదీ నుంచి జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టనున్నట్టు కడియం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మణిజ్యోత్స్న తెలిపారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్ల వయసు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తామని ఆమె తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, స్త్రీ శిశుసంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. కడియం మండల పరిషత్ కార్యాలయంలో ముందస్తు సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ వై.నాగేశ్వరరావు, ఎసిడిపిఒ కనకవల్లి, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఎఎన్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబ్జీ పోతురాజుకు డాక్టరేట్


పోతురాజును అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

న్యూ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం నుంచి రాజమహేంద్ర వరం ప్రభుత్వ అటానమస్ కళాశాల, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, రాజకీయ శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాబ్జీ పోతురాజు డాక్టరేట్ పొందినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్రఆర్‌కె తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 'పాకిస్థాన్-సౌదీ అరేబియా సంబంధాలు: 1977-2008' అనే అంశంపై బాబ్జీ పోతురాజు చేసిన పరిశోధన విశ్లేషణాత్మకంగా సాగిందని తెలిపారు. పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య మూడు దశాబ్దాల పాటు కొనసాగిన వ్యూహాత్మక, దౌత్య పరమైన సంబంధాలపై బాబ్జీ పోతురాజు చేసిన పరిశోధన అంతర్జాతీయ అధ్యయనాల్లో ముఖ్యమైనదిగా గుర్తింపు పొందింది. ఈ ప్రతిష్టాత్మక డిగ్రీ 21 జూన్ 2024న జెఎన్‌యు అధికారిక ముద్రతో అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ పోతురాజుకు ఆయన అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రోత్సాహం వల్లే తనకు డాక్టరేట్ వచ్చిందని డా. బాబ్జి పోతురాజు అన్నారు. తన భావాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు డాక్టర్ కస్తూరి సీతామహాలక్ష్మి, డాక్టర్ సయ్యద్ ఫరా యాస్రూన్ పాల్గొన్నారు.



క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

క్రీడా పోటీల్లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - దేవరపల్లి

రాజమహేంద్రవరంలో శుక్రవారం భాష్యం స్కూల్ ఈస్ట్ జోన్ ఏడు బ్రాంచీల మధ్య జరిగిన బాలికల ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో దేవరపల్లి భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీలలో దేవరపల్లి 13, రాజమహేంద్రవరం దానవాయిపేట 9, బాబానగర్ 3, బొమ్మూరు 2 టినగర్1, జంగారెడ్డి గూడెం 8 కొవ్వూరు1 ట్రోఫీలను సాధించారు. దేవరపల్లి భాష్యం స్కూల్ విద్యార్థులు అత్యధికంగా పదమాడు ట్రోఫీలను, తొంభై గోల్డ్ మెడల్స్ సాధించి ఓవరాల్ ఛాంపియన్షిప్ పొందారు. గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్, రాజమహేంద్రవరం దిశ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ కె. మంగళాదేవి, భాష్యం జోనల్ ఇంచార్జ వి. ఆంజనేయులు ట్రోఫీలు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్స్ ప్రిన్సిపల్స్ పి.హరిబాబు, కెవివి.సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, పార్వతి రెడ్డి, వై. రాహుల్, జె. సూర్యనారాయణ, పి.పేరయ్య నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.ట

నేరాలు ఘోరాలు


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

360 కేజీల గంజాయి స్వాధీనం -కేరళకు చెందిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి జాతీయ రహదారిపై ఎన్‌టి రాజపురం వెళ్లే కూడలి వద్ద శుక్రవారం పోలీసులు 360 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేరళ రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐటి వైఆర్‌కె.శ్రీనివాస్ మీడియాకు వివరించారు. శుక్రవారం ఎన్‌టి రాజపురం సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఐసర్ వ్యాన్లో ఎవరికీ ఎటువంటి అనుమానం కలగకుండా సినిమా పక్కిలో కేబుల్ వెనక భాగంలో ప్రత్యేక ఏర్పాటు చేసి 360 కేజీలు గంజాయిని 18 బస్తాల్లో లోడ్ చేసినట్లు గుర్తించామని తెలిపారు. దీని విలువ సుమారు రూ.26, 79,750 ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. విశాఖ ఏజెన్సీ నుంచి కేరళ రాష్ట్రం ఎర్నాకులం జిల్లాకు వెళ్తున్నట్లుగా విచారణలో తేలిందన్నారు. ఐచర్ వ్యాన్‌తోపాటు, షిఫ్ట్ డిజైర్ కార్‌ను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కేరళకు చెందిన దేవాసి అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న రూ.1300 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో పరారైన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐ శివనాగుబాబు, సిబ్బంది కాజా గిరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - ద్వారపూడి కెనాల్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేట్లపాలెం గ్రామానికి చెందిన భార్య భర్తలు తీవ్ర గాయాల పాలయ్యారు. వేట్లపాలెం గ్రామానికి చెందిన పెనుమర్తి సత్తిరాజు, పాపయ్యమ్మ దంపతులు సామర్లకోట నుంచి వేట్లపాలెం ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరు గాయపడగా వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమా దంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆబోతు తరమడంతో రైతుకు గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పశువులకు మేత వేసే క్రమంలో తాళ్లరేవుకు చెందిన రైతు వల్లు చిన్నను ఆబోతు వెంట పడటంతో పరుగుపెట్టాడు. ఈ నేపథ్యంలో తాడు తగిలి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో రైతు గాయాల పాలయ్యాడు. స్థానికులు ఆయనను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు.

'గుండెకు భరోసా'పై అవగాహన

ప్రజాశక్తి - అల్లవరం

అల్లవరం సామజిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం సూపరింటెండెంట్ ఎ.సరోజ ఆధ్వర్యంలో మండలం లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు గోడిలంక, బెండమూర్లంక ఎఎన్ఎం, ఆశా వర్కర్లకు గుండెకు భరోసా కార్యక్రమంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్ర వైద్య నిపుణులు డాక్టర్ మెట్ట లక్ష్మణరావు, ఎండి జనరల్ మెడిసిన్ డాక్టర్ పథ్విరాజ్ మాట్లాడుతూ గుండె పోటు వంటి విపత్కర పరిస్థితుల్లో సకాలంలో సత్వర వైద్యం పొందినపుడే ప్రాణాన్ని నిలబెట్టుకోగలమన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సరోజ మాట్లాడుతూ గుండెనొప్పి రోగులకు స్వాంతన చేకూరలా హబ్ అండ్ స్పోక్ విధానంలో రూ.45వేలు ఖరీదు చేసే ఇంజక్షన్ అవసరమైన రోగులకు ఉచితంగా అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమం లో అల్లవరం సామజిక కేంద్రం సిబ్బంది, గోడిలంక, బెండమూర్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్స్, సిబ్బంది పాల్గున్నారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ టీము కెప్టెన్‌గా హర్షతేజ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఇటీవల రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు పట్టణంలోని స్థానిక కృతివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ టీమ్‌కు మోడరన్ హైస్కూల్లో టెన్త్ విద్యార్థి కొడమంచిలి హర్షతేజ కెప్టెన్‌గా ఎన్నికయినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ డాక్టర్ జివి.రావు శుక్రవారం తెలిపారు. జివి.రావు మాట్లాడుతూఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్ర యూత్ బాస్కెట్ బాల్ టీమ్‌కి కెప్టెన్‌గా హర్ష తేజ ఆడతాడని తెలిపారు. హర్షతేజని జివి.రావు, రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, వైద్యుడు డాక్టర్. చెలికాని స్టాలిన్, హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు చిట్టిబాబు అభినందించారు.

వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు గిరిజా కుమారికి సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలిగా వైసిపి నాయకురాలు సన్నవిల్లి-నంగవరం ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజా కుమారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమెను శుక్రవారం సన్నవిల్లిలోని ఆమె నివాసంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు సత్కరించారు. జయరాజు మాట్లా డుతూ పదవి ద్వారా వైసిపి మరింత బలోపేతానికి కృషిచేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు.

అనారోగ్యంతో ఉడిమూడి విఆర్ఎ మృతి

ప్రజాశక్తి - కె.గంగవరం

ఉడుమూడి గ్రామ విఆర్ఎ దువ్వా ప్రకాశం (56) అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన ఆయన కాకినాడలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన మృతికి కె.గంగవరం తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్ఐ నరాల వెంకట్రావు, విఆర్ఒ సంఘనాయకులు సంతాపం తెలిపారు.

అనువైన స్థలాలు గుర్తించాలి: కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జెసి రాహుల్ మీనాతో కలిసి జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుపై చర్చించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన భూములు వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద జీవ ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహకాలను తీసుకువచ్చిందన్నారు. ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంటును రిలయన్స్ సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుకు ఒప్పందం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

కుదుర్చుకుందన్నారు. ఈ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఐదేళ్లపాటు సుస్థిర మూలధనం పెట్టుబడిపై 20 శాతం, స్టేట్ జిఎస్‌టి పూర్తి రియంబర్స్‌మెంట్, ఐదేళ్లపాటు విద్యుత్ రాయితీ ఇవ్వనున్నదని తెలిపారు. సాంప్రదాయ వనరులపై ఆధారపడడం తగ్గించడంతో పాటు వ్యర్థాలను శక్తిగా మార్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నదన్నారు. ఈ కంప్రెస్డ్ బయోగ్యాస్ సేంద్రీయ వ్యర్థాల మూలాల నుంచి తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ ప్లాంటుకు అనువైన భూములను గుర్తించాలన్నారు. ప్రధానంగా అటవీ, అసైన్డ్ భూముల వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన ఎంఎల్ఎ సత్యప్రభ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


మంత్రితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సత్యప్రభ

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణను ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ శుక్రవారం కాకినాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె స్థానిక మీడియాకు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో రహదారుల సమస్యలను, సాగు నీటి ప్రాజెక్టులు ఉన్నా రైతులకు సాగునీరు అందడం లేదని, తక్షణమే సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆత్రేయ చెంతన పొగతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - తాళ్లరేవు


రోడ్డును కమ్మేసిన పొగ

మండలంలోని కోరంగి పంచాయతీ సుబ్బరాయుడు దిమ్మ ఆత్రేయపాయ చెంతన ఉన్న చెత్తను కొందరు దగ్ధం చేయడంతో వాటి నుంచి వచ్చే పొగ, ధూళితో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దట్టమైన పొగ రోడ్డుమీద వ్యాపించడంతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎదురుగా ఏమొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. చెత్తను అంటించడం మంచిదే అయినా, జనసంచారం లేని సమయంలో ఇలాంటి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

యానాం వార్తలు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యానాం పారిపాలనాధికారి మునిస్వామి

కలెక్టర్‌ను కలిసిన పరిపాలనాధికారి

ప్రజాశక్తి - యానాం

కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునుస్వామి శుక్రవారం కలెక్టరేట్‌లో కలిశారు. యానాంలో నెలకున్న సాగు, తాగునీటి ఎద్దడి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రజాపనులశాఖ అధికారులు ఉన్నారు.


తుప్పలను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్‌యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం దత్తత గ్రామాలైన కురసాంపేట, అయ్యన్ననగర్‌లో ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు వాటిళుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లోఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒలు నరేష్, ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దళిత రైతుల పట్ల చిన్న చూపు

ప్రజాశక్తి - యానాం

దళిత రైతుల పట్ల అధికారులు చిన్న చూపు చూస్తున్నారని దరియాలతిప్ప రైతులు ఆందోళన వక్తం వక్తం చేశారు. శుక్రవారం పంట చేలు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అన్నం పెట్టే రైతులను అధికారులు చిన్న చూపు చూస్తున్నారని, సాగునీరు అందించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. పంట చేలు ఎండిపోయే దుస్థితికి తీసుకొచ్చారని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు రైతులకు సాగు,తాగునీరు అందించడంలో పిడబ్ల్యుడి శాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. రూ.50 కోట్లతో నిర్మించిన పైపులైను ప్రాజెక్టు వ్యర్థంగా మారిందన్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుకోటి నాగేశ్వరరావు, తిరుకోటి భైరవ మూర్తి, కోరుకుండ ఆనంద రావు, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల వెంకన్న, బస్స మాణిక్యాలు, మట్టా సత్యనారాయణ, మట్టా రాంబాబు, పాల్గొన్నారు. ఈ సమస్యపై సిఐటియు జిల్లా అధ్యక్షులు గుడే దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతుల సమస్యల తక్షణమే తీర్చాలని, లేకుంటే పోరాటాన్ని సాగిస్తామని అన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని పొన్నాడ గ్రామంలో 3 రోజులపాటు నిర్వహించే ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, సురక్ష అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ ఈ ఉత్సవంలో పాల్గొని బషీర్ బేబీ(బంగారు పాపమ్మ) దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3 రోజులపాటు నిర్వహించే ఉరుసు ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున యాత్రికులు పాల్గొంటారని తెలిపారు. వచ్చే యాత్రికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.


దర్గాను సందర్శించిన జనసేన నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా

హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ కాకినాడ డిఎస్ఎ స్టేడియంలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టోర్నమెంట్ నిర్వాహక కమిటీలతో ఆయన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజుల పాటు జరిగే టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. పోటీలకు తరలి వచ్చే క్రీడాకారుల కొరకు సౌకర్యాలతో కూడిన బస కల్పించాలని, కాకినాడ, సామర్లకోట రైల్వే, బస్ స్టేషన్ల నుంచి వారి బసకు, బసచోటు నుంచి క్రీడా మైదానానికి వెళ్లేందుకు బస్సులు, కార్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. క్రీడాకారుల నమోదు, పోటీల నిర్వహణ సజావుగా జరిగేట్లు ఏర్పాట్లు చేపట్టాలని రిజిస్ట్రేషన్, టెక్నికల్ కమిటీలను కోరారు. ఆహార, వైద్యసేవలను ఫుడ్, మెడికల్ ఉపకమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రారంభ, ముగింపు వేడుకల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పబ్లిసిటీ, మీడియా సమన్వయం, పారిశుద్యం, ట్రాఫిక్, క్రౌడ్ నియంత్రణ, పార్కింగ్, లేటింగ్ తదితర అంశాలను ఆయా కమిటీల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసకుమార్, సిపిఒ పి.త్రినాథ్, వివిధ ఉప కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుని సస్పెన్షన్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిపై డిఇఒ ఆదేశాలతో సస్పెన్షన్ వేటు పడింది. మండలంలోని కొత్త మూలపేటలో ఉన్న ప్రాథమిక పాఠశాల (ఎస్ఇజెడ్ కాలనీ) 5వ తరగతి చదువుతున్న విద్యార్థినుల పట్ల పాఠశాల ఉపాధ్యాయుడు సుధీర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విద్యార్థినుల తల్లీదండ్రులు డిఇఒకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన అధికారులు సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు అందించడంతో ఉపాధ్యాయుడిపై సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కాలబైరవ స్వామి తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు


విద్యుత్ కాంతులతో భైరవ స్వామి ఆలయం

మండలంలోని కోరంగి పంచాయతీ సుబ్బారాయుడు దిమ్మ ప్రాంతంలో కాలభైరవ స్వామి తీర్థం శనివారం జరగనుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలభైరవ స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- పెద్దాపురం


అమ్మవారిని దర్శించుకున్న ఆర్‌డిఒ

స్థానిక మరిడమ్మ ఆలయంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో శుక్రవారం పూజలు, అర్చనలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాదులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు. మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం ఆర్‌డిఒ శ్రీరమణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆసాదులు, వేద పండితులు ఆమెకు ఆలయ మర్యాదలతో, ఆశీర్వచనాలతో అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

తాళ్లరేవు: నేటి నుంచి తాళ్ళరేవు వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. 8వ తేదీ రాత్రి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. 9వ తేదీ సూపర్ డూప్స్ డాన్స్ హంగామా, 10 వతేదీ కోలాటం, 11వ తేదీ వెరైటీ బుర్రకథ, 12వ తేదీ సినీ మ్యూజికల్ నైట్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు, మెయిన్ రోడ్డును విద్యుత్ దీపాలతో అలంకరించారు.


నీటి శాంపుల్స్‌ను సేకరిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న ఉండూరు రోడ్డులోని తాగునీటి ఫిల్టర్ బెడ్‌ను తిరుపతి యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. గత కొంత కాలంగా పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం కావడం విధితమే. మున్సిపల్, జిల్లా అధికారులు ప్రత్యక్ష పరిశీలన చేశారు. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో సివిల్, పర్యావరణ శాఖ సీనియర్ రీసెర్చ్ స్కాలర్ పుట్టంరెడ్డి శివసాయి, ప్రొఫెసర్, సివిల్ ఇంజనీర్ డేవిడ్ లివింగ్‌స్టన్, సివిల్, పర్యావరణ సహాయ ప్రొఫెసర్ నిప్పట్లపల్లి నరసమ్మల బృందం ఫిల్టర్ ప్లాంట్ చెరువులో ఉన్న గోదావరి జలాలను పరిశీలించి సాంపిల్‌ను సేకరించారు. అలాగే ప్లాంట్‌లో శుద్ధి కాబడిన జలాలను, ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న జలాల సాంపిళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ ప్లాంట్ ద్వారా గోదావరి జలాలను శుద్ధిచేస్తున్న పద్ధతిని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యను, స్థానికంగా ఉన్న టెక్నికల్ సిబ్బందిని అడిగి తెలుసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేకరించిన సాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్టు చెప్పారు. రిపోర్టులు వచ్చిన తరువాత తాగునీటి నాణ్యతపై సర్టిఫికెట్ అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ, ఫిల్టర్ ప్లాంట్ సూపర్‌వైజర్ గిడుతూరి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.